క్లుప్తంగా

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయండి

సిరిసిల్ల: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ కోరారు. తెలంగాణ భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మూడేళ్లుగా ఫీజు బకాయిలు, ఉపకార వేతనాలు విడుదల కాక కళాశాల యాజమాన్యాలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈనెల 26లోపు నిధులు విడుదల చేయకుంటే చేనేత విగ్రహం ముందు వేలాది మంది విద్యార్థులతో మహా ధర్నా చేపడతామని హెచ్చరించారు. మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేశ్, సాయి శ్రీను, అరవింద్, రోహిత్, గణేశ్, సంపత్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని కార్మికవాడల్లో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు డ్రగ్స్ నివారణపై కళాప్రదర్శన నిర్వహించారు. సాంస్కృతిక సారథి బృందం లీడర్ ఎడ్మల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరుతూ ఆటపాటలతో అవగాహన కల్పించారు. కళాకారులు శ్రీరాముల రాంచంద్రం, గడ్డం శ్రీనివాస్, గుగ్గిల్ల పర్శరాములు, గణేశ్ పాల్గొన్నారు

సర్దుబాటు ఉత్తర్వులు సవరించాలి

వేములవాడఅర్బన్: అసంబద్ధమైన సర్దుబాటు ఉత్తర్వులు సవరించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్ కోరారు. వేములవాడ మండలం రుద్రవరం పాఠశాలలో సోమవారం తపస్ సభ్యత్వ నమోదు చేపట్టారు. తపస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి బాలరెడ్డి, జయకృష్ణ, రవి, గిరిధర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చెక్కులు అందజేత


చెక్కు అందిస్తున్న అంజిరెడ్డి

ముస్తాబాద్: విద్యుదాఘాతంతో నష్టపోయిన రైతాంగానికి సెస్ అండగా ఉంటుందని డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. సెస్ సేవాసదన్‌లో సోమవారం బాధితులకు నష్ట పరిహారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ ముస్తాబాద్‌కు చెందిన గొర్రెల కాపరి చెవుల గోపయ్యకు చెందిన గొర్రెలు ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతిచెందాయని, గూడెంకు చెందిన గంగమద్రి సత్తయ్య గేదె విద్యుత్‌షాక్‌తో మృతి చెందిందన్నారు. బాధిత రైతులకు రూ.54వేల విలువైన చెక్కులు అందజేశామన్నారు. రైతులు పంటపొలాల వద్ద జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఏఈ విష్ణు తేజ, సెస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



గంభీరావుపేట: గంభీరావుపేట ఎస్సైగా శివకుమార్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎస్సైగా పనిచేసిన రామ్మోహన్ తంగళ్లపల్లి ఠాణాకు బదిలీ అయ్యారు. బదిలీపై వచ్చిన శివకుమార్ నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

పంటల పరిశీలన



ఇల్లంతకుంట: మండలంలోని పెద్ద లింగాపూర్‌లో పత్తి, వరిపంట చేన్లను ఏరువాక కరీంనగర్ శాస్త్రవేత్తలు సోమవారం రైతులు, మండల వ్యవసాయాధికారులతో కలిసి పరిశీలించారు. ఆకుమచ్చ, రసం పీల్చే పురుగుల వ్యాప్తిని గుర్తించారు. వీటి నివారణకు ఏ మందులు వేయాలో రైతులకు సూచించారు. అనంతరం గ్రామంలో రైతుసదస్సు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేంద్రప్రసాద్, మదన్మోహన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి జ్యోతి పాల్గొన్నారు.

28 వరకు దరఖాస్తులు

తంగళ్లపల్లి: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కవిత ప్రకటనలో కోరారు. ఈనెల 28 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, ప్రభుత్వ ఐటీఐలో సీవోపీఏ, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఫిట్టర్, మెకానికల్ మోటార్ వెహికిల్, వెల్డర్ ఖాళీలు ఉన్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు మండెపల్లిలోని ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

సభకు తరలిరావాలి

వేములవాడఅర్బన్: సికింద్రాబాద్‌లోని కొండా లక్ష్మణ్‌బాపూజీ ప్రాంగణంలోని హరిహరా కళాభవన్‌లో ఈనెల 27న నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఘన సన్మాన కార్యక్రమానికి కళాకారులు తరలిరావాలని కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి కోరారు. వేములవాడలోని కళాకారుల విభాగం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- జిల్లాలో ముగిసిన సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీలు
- 20 జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులు
- బాలురు మెదక్, బాలికల్లో నిజామాబాద్ చాంపియన్లు


బాలికల చాంపియన్‌గా నిజామాబాద్ జట్టు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో జరిగిన సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలు సోమవారం ముగిశాయి. క్రీడాకారుల ప్రతిభను ప్రజలు ఆసక్తితో తిలకించారు. బెస్ట్ పిచర్, బెస్ట్ ఆల్‌రౌండ్, బెస్ట్ క్యాచర్ అంటూ..ప్రేక్షకుల అరుపులు, కేరింతలతో పోటీల్లో రెండ్రోజుల పాటు క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఇరవై జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు.

రెండ్రోజులు..ఇరవై జట్లు..

ఆదివారం నుంచి రెండ్రోజుల పాటు జరిగిన సాఫ్ట్‌బాల్ జూనియర్స్ విభాగంలో పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల నుంచి బాలబాలికలు 852 మంది హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బాలురు, బతుకమ్మ ఘాట్ వద్ద మైదానంలో బాలికలకు పోటీలు నిర్వహించారు. సోమవారం క్రీడలు ముగియడంతో క్రీడాకారులకు సిరిసిల్లలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, తెలంగాణ భవన్, ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో వసతి కల్పించారు. స్థానిక టౌన్‌క్లబ్ ఆవరణలో భోజన వసతిని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నిర్వాహకులు కల్పించారు. ఆది, సోమవారాల్లో అండర్- 17 (జూనియర్స్) విభాగంలో బాలురు, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో తొలిసారి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించారు.

చాంపియన్లుగా మెదక్, నిజామాబాద్

జిల్లాకేంద్రంలో జరిగిన సాఫ్ట్‌బాల్ రాష్ట్రీయ పోటీల్లో బాలికల విభాగంలో నిజామాబాద్(ప్రథమ), మహబూబ్‌నగర్ (ద్వితీయ), సిద్దిపేట(తృతీయ), బాలురలో మెదక్ (ప్రథమ), నిజామాబాద్ (ద్వితీయ), మంచిర్యాల (తృతీయ) స్థానాలను కైవసం చేసుకున్నాయి. వీరికి డీవైఎస్‌వో ఏ. రాందాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. బెస్ట్ ప్లేయర్స్‌గా బాలురులో అరవింద్(మెదక్), కల్యాణ్ (నిజామాబాద్), గణేశ్ (నిజామబాద్), శ్రీకాంత్ (మంచిర్యాల), బాలికల్లో బెస్ట్‌ప్లేయర్స్‌గా సౌమ్యరావు (నిజామాబాద్), వర్షిత(నిజామాబాద్), శరణ్య (జగిత్యాల), లావణ్య (సిద్దిపేట) రాణించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంట అంజయ్య, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.శోభన్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్లుగా ఆడుతున్నా..



ఆరేళ్లుగా సాఫ్ట్‌బాల్ ఆడుతున్న. అమ్మా నాన్న భవన నిర్మాణ కార్మికులు. హన్మకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ ఫస్టియర్ చదువుతున్నా. మా పీఈటీ అశోక్‌సార్ ప్రోద్బలంతో ఐదో తరగతి నుంచి సాఫ్ట్‌బాల్ ఆడటం మొదలుపెట్టా. ఎన్నో టోర్నమెంట్‌లలో పాల్గొన్న. గత మార్చిలో కర్ణాటకలో జరిగిన నేషనల్స్‌లో పాల్గొని రెండో స్థానంలో నిలిచా.

– బర్ల సాత్విక్, హన్మకొండ

సాఫ్ట్‌బాల్ అంటే ఇష్టం



మాది ఆదిలాబాద్ జిల్లా నేరేడుగొండ. ప్రభుత్వ బడిలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. అంతర్జాతీయ క్రీడా సాఫ్ట్‌బాల్ అంటే ఇష్టం. పీఈటీ మేడం నాకు ఆరోతరగతి నుంచి సాఫ్ట్‌బాల్‌పై శిక్షణ ఇస్తుంది. 11 సార్లు టోర్నమెంట్లలో రాష్ట్రీయంగా 09, జాతీయ పోటీల్లో 02 సార్లు పాల్గొన్న. అమ్మానాన్నలు వ్యవసాయ కూలీలు. పీఈటి కావాలన్నదే లక్ష్యం.

– మాస్‌కాని అరుషి, ఆదిలాబాద్

మూడు నెలల శిక్షణతో



వరంగల్ రామప్ప డిఫెన్స్ కళాశాలలో ఎంపీసీ ఫస్టియర్ చదువుతున్నా. పీఈటీ ఈశ్వర్‌కుమార్ సార్ అవగాహన కల్పించారు. ఆరు టోర్నమెంట్లలో ఆడాను. నేషనల్స్ గేమ్స్‌లో రెండోస్థానం సాధించా. నేషనల్ గేమ్స్‌కు ముందు పీఈటీ సార్ మూడునెలలు శిక్షణ ఇవ్వడంతో ద్వితీయ స్థానం సాధించా. సబ్ ఇన్‌స్పెక్టర్ కావాలనేదే లక్ష్యం.

– వైష్ణవి, వరంగల్

అవకతవకలపై విచారణ జరపాలి


మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

సిరిసిల్లటౌన్: రేషన్‌డీలర్ల నియామకంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల బీవైనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ఏడు మండలాల్లో 58 చౌకధరల దుకాణాల డీలర్ల ప్రక్రియపై అభ్యర్థులు చేస్తున్న ఆరోపణలపై కలెక్టర్ స్పందించాలని కోరారు. వెంటనే డీలర్ల నియామక ప్రక్రియ నిలిపివేసి మరోసారి పారదర్శకంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గాంతుల మహేశ్, నాగరాజు, అనిల్, మహేశ్, దినకర్ తదితరులున్నారు.

ఏఎంసీ పాలకవర్గానికి సన్మానం


గంభీరావుపేట: సన్మానం పొందిన ఏఎంసీ పాలకవర్గ సభ్యులు

గంభీరావుపేట: నూతనంగా నియామకమైన గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సముద్రలింగాపూర్‌లో సోమవారం నాయకులు ఘనంగా సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ, వైస్ చైర్మన్ అంజిరెడ్డి, డైరెక్టర్లను సన్మానించారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు హమీద్, మాజీ సర్పంచ్ పూజం భూమరాజం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శహన్మండ్లు, మాజీ ఎంపీటీసీ పర్శరాములు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని

ఎల్లారెడ్డిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. చైర్మన్ షేక్ సబేరా బేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డిలతో పాటు కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండలశాఖ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

యువకుడిపై కేసు

చందుర్తి: బాలికను ప్రేమపేరుతో వేధిస్తున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు చందుర్తి ఏఎస్సై బాపు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆశిరెడ్డిపల్లెకు చెందిన మైనర్ బాలిక నర్సింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతోంది. సోమవారం ఉదయం నోట్‌బుక్స్ తెచ్చుకునేందుకు ఇంటికి వెళ్తుండగా బోదాసు సతీశ్ అనే యువకుడు మార్గమధ్యలో అటకాయించి తనను పెళ్లి చేసుకోవాలని బెదిరించాడు. అక్కడినుంచి తప్పించుకున్న బాలిక తన చిన్నాన్న శ్రీనివాస్‌కు విషయం తెలపడంతో బాలికకు మేనబావ అయిన సతీశ్ అక్కడి నుంచి పారిపోయాడు. కొద్దిరోజులుగా తమ కూతురును బోదాసు సతీశ్ అనే యువకుడు వేధిస్తున్నాడని, బాలిక తల్లి నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై..

చంపుతానని బెదిరిస్తూ, అసభ్యంగా ప్రవర్తించిన మండలకేంద్రానికి చెందిన పోతురాజు రవిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై బాపు తెలిపారు. మండలకేంద్రానికి చెందిన మర్రి రమేశ్ ఇంటిపక్కన పోతురాజు రవి మూత్ర విసర్జన చేశాడు. దీనిపై ప్రశ్నించినందుకు శనివారం తమ వాకిట్లో మళ్లీ మూత్ర విసర్జన చేశాడు. అంతేకాక తనను చంపుతానని బెదిరిస్తూ, అసభ్యంగా ప్రవర్తించాడని మర్రి రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

● ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే అరెస్టులా ?

సిరిసిల్లటౌన్: ప్రజా సమస్యలపై నిరసన చేపడితే ఏఐఎఫ్‌టీయూ న్యూరాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథాన్ని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆపార్టీ నేతలన్నారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. సిరిసిల్ల కొత్తచెరువు నాలాలు, రోడ్డాం కబ్జాలను ప్రశ్నిస్తుంటే పోలీసులు ముందస్తుగా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు చెరువులు, నాలాల కబ్జాపై ఫిర్యాదు చేస్తామన్నారు. నాయకులు ఎల్లయ్య, నారాయణ, దేవదాసు, పాండు పాల్గొన్నారు.

● పోలీసులకు ఫిర్యాదు

వేములవాడ: తనను పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రజనికాంత్ కులం నుంచి వెలివేస్తానని నోటీసులు జారీచేయడంతోపాటు బెదిరింపులకు గురిచేస్తున్నారని రాపెల్లి శ్రీధర్ స్థానిక పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్సై అంజయ్య తెలిపారని బాధితుడు పేర్కొన్నాడు.

● స్వయంపాలనా దినోత్సవం

సిరిసిల్లకల్చరల్: స్థానిక సెస్ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు రూ. 500 చొప్పున నగదు బహుమతులు కళాశాల ప్రిన్సిపాల్ వనజకుమారి అందజేశారు. అధ్యాపకులు సీతారాము, కె. సునిత, వి. శ్రీనివాస్, బి. ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.

● ఆటో యూనియన్ ఎన్నికలు

వేములవాడఅర్బన్: వేములవాడ ఆటో యూనియన్ డివిజన్ స్థాయి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. అధ్యక్ష పదవి పోటీ కోసం చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, బత్తుల దేవయ్య, సయ్యద్ ఉమార్ ముగ్గురు నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 30న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

● పంచాయతీగా ప్రకటించాలి

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీలో విలీనమైన శాత్రాజుపల్లి గ్రామాన్ని మళ్లీ గ్రామ పంచాయతీగా ప్రకటించాలని అదే గ్రామానికి చెందిన దోమకొండ మహేందర్ అనే యువకుడు ప్రధాన కూడలి వద్ద దీక్ష చేపట్టారు. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడే ఎంతో అభివృద్ధి చెందేదని, ప్రస్తుతం మున్సిపాలిటీలో విలీనమైన తర్వాత ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. మళ్లీ గ్రామ పంచాయతీగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన దీక్షకు గ్రామంలోని పలువురు సంఘీభావం తెలిపారు.

● నియామకం

సిరిసిల్లటౌన్: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా బత్తుల మహేందర్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడిగా దొంతుల చంద్రం నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగమూర్తి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్నారు.

● కొత్త నిబంధనలు రూపొందించండి

సిరిసిల్లకల్చరల్: ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలు అశాస్త్రీయంగా ఉన్నాయని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మ్యాదారం హరికృష్ణ ఆరోపించారు. హేతుబద్ధత లేని నిబంధనలు మార్చి కొత్త నిబంధనలు రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలన్నారు. సరైన నిబంధనల రూపకల్పన తర్వాతే ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. ఆయన వెంట సంఘం రాష్ట్ర బాధ్యుడు పి. సత్యనారాయణ ఉన్నారు.

● గ్రామసభ

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరంలో ప్రత్యేకాధికారి ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండగలో భాగంగా అవసరమున్న చోట వీధిదీపాలు, పారిశుధ్య పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన అగ్రికల్చర్ గోదాం, ప్రభుత్వ పాఠశాలలో మూత్రశాలలు, పెండింగ్ పనులు, అలాగే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామస్తులు ఉన్నారు.

● కార్యవర్గం ఎన్నిక

కోనరావుపేట: మండల పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలిగా కవిత, కోశాధికారిగా వేణు, ప్రధాన కార్యదర్శిగా గంగాధర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, అఖిలాష్, రజిత, రవి, కరుణాకర్, గంగాధర్ తదితరులు ఎన్నికయ్యారు.

● అడవిపందుల దాడిలో పంటలు ధ్వంసం

కోనరావుపేట: నిమ్మపల్లిలో అడవిపందుల దాడిలో పంటలు ధ్వంసమయ్యాయి. గ్రామానికి చెందిన మారుపాక లింగయ్యకు చెందిన రెండెకరాల పంట పూర్తిగా ధ్వంసమైంది. వీరితోపాటు కదిరె శ్రీనివాస్, అనుముల అంజి, శ్రీనివాస్ అనే రైతులకు చెందిన పంటలను ధ్వంసం చేశాయి.

● ఆటోడ్రైవర్ తప్పిదంతోనే రోడ్డు ప్రమాదం

తంగళ్లపల్లి: తంగళ్లపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన ఆటో, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఆటోవాలాదే తప్పని తేలింది. సంఘటన స్థలం సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ప్రమాద దృశ్యం రికార్డయింది. రాంగ్ రూట్లో వచ్చిన ఆటో సిరిసిల్ల నుంచి వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న కోల రంజిత్ గాయపడ్డారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు.

● లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటం

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ అన్నారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 23ను బ్లాక్ డేగా అభివర్ణిస్తూ సోమవారం పార్టీ కార్యాలయంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సిరిమల్ల సత్యం, ఉడుత రవి, మచ్చ వేణు, గాజుల రాజు తదితరులు పాల్గొన్నారు.

● ఆర్థికసాయం అందజేత

ఇల్లంతకుంట : గాలిపెల్లి బీసీ హాస్టల్‌లో పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామావత్ రోహిత్ కుటుంబానికి సేకరించిన రూ.59 వేలను సోమవారం బాలుడి కుటుంబసభ్యులకు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు పావని, మారుపాక అనిల్, హాస్టల్ వార్డెన్ గంగయ్య, ఉపాధ్యాయులు హరికృష్ణ రెడ్డి, నరేందర్ రెడ్డి, బాలుడి తల్లి సుశీలకు ఆర్థికసాయం అందజేశారు

● ఎమ్మెల్యే అందుబాటులో లేరని ఫిర్యాదు

గంభీరావుపేట: నియోజకవర్గ సమస్యలు పట్టించుకోకుండా ప్రజలకు అందుబాటులో లేరని సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కోడె మహేశ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండలంలో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడం లేదని, లింగన్నపేట, గంభీరావుపేట మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం పనుల్లో జాప్యంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడి కిలోమీటర్ల కొద్ది దూరం తిరిగి పోతున్నారన్నారు. ఎమ్మెల్యేగా పాత బ్రిడ్జి కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



గంభీరావుపేట: మండలకేంద్రంలోని కాకులగుట్ట వద్ద నిర్మించిన శ్మశానవాటికకు సంబంధించిన టాయిలెట్స్ నిరుపయోగంగా మారాయి. ఐదేళ్లుగా వీటిని ఉపయోగించడం లేదు. వాటికి తలుపులు లేకపోవడం, కుళాయి సరిగా లేకపోవడం, దట్టమైన చెట్ల మధ్య నిర్మించారు. అధికారులు పట్టించుకొని సమస్యను పరిష్కరించాలి.

– ఎర్రోళ్ల బాలకిషన్, బరిగెలగూడెం, గంభీరావుపేట

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : రాజేశ్వర్, ఎంపీవో ఫోన్ నెంబర్: 9701781898

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి


బోయినపల్లి: మాట్లాడుతున్న శ్రీధర్, తదితరులు

సిరిసిల్లటౌన్: బిల్డింగ్ వెల్ఫేర్ బోర్డుద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు మిట్టపల్లి రాజమౌళి డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్ల నుంచి పెద్దసంఖ్యలో కార్మికులతో కలిసి చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కార్మిక పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, హాస్టల్స్‌లో ప్రత్యేక మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమాను రూ.10లక్షలు అందించాలని, కార్మికులకు ఈశ్రమ్ కార్డులు అందించాలని కోరారు. నాయకులు ఎల్లారెడ్డి, గీసా భిక్షపతి పాల్గొన్నారు. బోయినపల్లి: సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ పేరిట లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు చేపట్టిన ధర్నాకు మండలంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్మికులు సోమవారం తరలివెళ్లారు. సీఐటీయూ భవన నిర్మాణ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గురజాల శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలను కార్మికులకు అందించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులు పూదరి లింగయ్య, మోహన్, రాజు, రత్నయ్య, కొండ శ్రీనివాస్ తదితరులున్నారు.


విప్‌ను కలిసిన సిరిసిల్ల ఏఎంసీ కార్యవర్గం


సిరిసిల్లటౌన్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసిన పాలకవర్గం

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సోమవారం సిరిసిల్ల ఏఎంసీ కార్యవర్గం మర్యాద పూర్వకంగా కలిసింది. నూతనంగా నియామకమైన పాలకవర్గాన్ని ఆయన సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూప, కార్యవర్గ సభ్యులు తదితరులున్నారు.

ముస్తాబాద్: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను పోతుగల్ ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి నర్సింలు, వైస్ చైర్మన్ వెల్ముల రాంరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చైర్ పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్ట అధ్యక్షుడు గజ్జెల రాజు, కొండం రాజిరెడ్డి, గుండెల్లి శ్రీను, ఆరుట్ల మహేశ్, అన్నం శ్రీధర్‌రెడ్డి, ముచ్చర్ల శ్రీను, భాను, దేవేందర్, గంత రాజు, కొమురెల్లి తదితరులున్నారు.

విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ జయంతి, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో జయంతి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 26న ఐలమ్మ జయంతి, 27న కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని సిరిసిల్ల పట్టణ ంలోని లహరి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రముఖులు, నాయకులు, మేధావులు, ప్రజలు హాజరుకావాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పంతం రవి, డీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

● సన్మానం

వీర్నపల్లి: వీర్నపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన లకావత్ రాములు నాయక్‌ను రంగంపేట మార్కెట్ డైరెక్టర్‌ను గ్రామ పంచాయతీలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నందగిరి లింగయ్య, మాజీ ఎంపీటీసీ రేణుక, రాయిని బుగ్గయ్య, తేజ, కాశీరాం, దేవరాజు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా ఉన్న కోనోకార్పస్ చెట్లను తొలగించాలని తెలంగాణ జాగృతి ప్రతినిధి జూపల్లి నాగేందర్‌రావు కోరారు. ఈ కోనోకార్పస్ మొక్కలను రోడ్డు మధ్యలో డివైడర్లపై పెట్టారని అవి ఇప్పుడు చెట్లుగా మారి పుప్పొడిని వెదజల్లుతూ వాయుకాలుష్యానికి కారణమవుతున్నాయన్నారు. సమాజానికి చెడు చేస్తున్న కోనోకార్పస్ మొక్కలను పూర్తిగా తొలగించాలని కోరుతూ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.

రేషన్ బియ్యం తరలించిన వ్యక్తి రిమాండ్


గట్టయ్య రిమాండ్ చూపుతున్న ఎస్సై

ముస్తాబాద్: ప్రజాపంపిణీ వ్యవస్థలోని పేదల బియ్యం అక్రమంగా తరలిస్తున్న ఒకరికి తొలిసారి కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై గణేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. మండలంలోని నామాపూర్‌కు చెందిన కడమంచి గట్టయ్య ఈనెల 9న ఆటోలో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నారు. సిరిసిల్ల కోర్టులో హాజరుపరచగా.. గట్టయ్యకు 14 రోజుల రిమాండ్ విధించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో జిల్లాలో తొలిసారి ఒకరికి రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మర్రిపల్లి రైతులు


కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మర్రిపల్లి రైతులు

వేములవాడరూరల్: వేములవాడరూరల్ మండలం మర్రిపల్లి శివారులోని 750 సర్వే నంబర్‌లోని మల్లయ్యకుంటను కబ్జాచేసి కొందరు రైస్‌మిల్లులు నిర్మించారని గ్రామ రైతులు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గతంలో ఉన్న చెరువుతో ఈ ప్రాంతంలో నీటిసౌకర్యం ఉండేదని, అలాంటి చెరువును కొందరు వ్యాపారులు అప్పటి అధికారులను ప్రలోభాలకు గురిచేసి అక్రమపద్ధతిలో అనుమతి పొంది రైస్‌మిల్లు నిర్మించారని ఫిర్యాదులో తెలిపారు. వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా : 9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899